క్లుప్తంగా

ఎయిమ్స్‌లో వైద్య విద్యార్థుల నిరసన



మంగళగిరి: కోల్‌కొత్తా ఆర్‌జీకేఏఆర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడిని నిరసిస్తూ మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. వైద్యులపై జరుగుతున్న ఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం సాధారణ సేవలకు మాత్రమే పెన్ డౌన్, స్టెత్ డౌన్ చేస్తున్నామని, నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే అత్యవసర సేవలను నిలిపేస్తామని హెచ్చరించారు.

పెనుమాకలో ఉచిత పశువైద్య శిబిరం



మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని పెనుమాక గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 15 పశువులకు సాధారణ చికిత్స అందించారు. 24 దూడలకు నట్టల నివారణ మందులు, 35 మంది రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. పశుపోషకులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు బాలశంకర్, నరేంద్ర, ప్రవీణ, యాసిన్ సుల్తాన్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గ్రామానికి చెందిన డేరంగుల శివశంకరరావు సాయంతో పెన్నులు, పుస్తకాలు, స్కేళ్లు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జె.సుబయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యద్వారానే పేదరికం, అసమానతలు తొలగించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, ఎం.బాలమ్మ, ఎ.శివశంకర్, మరియదాసు, ప్రకాష్, కె. రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, హెచ్ఎం డి.కమల్‌మోహన్, సుందరరావు, బాల రవి కుమార్ పాల్గొన్నారు.

రైతులకు సమగ్ర యాజమాన్యంపై శిక్షణ



మంగళగిరి: దుగ్గిరాల మండలంలోని పెనుమూలి, కంఠంరాజు కొండూరు గ్రామాలలో ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. సమగ్ర యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎస్.నగేష్, ఎస్.ఉషారాణి, పి.శిరీష, రమేష్, ఇందిర, భానుప్రకాష్ పాల్గొన్నారు.

శిథిల పాఠశాల భవనాన్ని తొలగించరూ..!



తాడికొండ: తాడికొండ వైసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల భవనం ప్రమాదకరంగా మారింది. ఇది శిథిలమై 10 సంవత్సరాలు దాటుతున్నా ప్రమాదం అంచున ఉన్న భవనాన్ని తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోపోవడంతో చిన్నారులకు ప్రాణ సంకటంగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం కూడా శ్లాబ్ పెచ్చులూడే స్థితికి చేరడంతో జరగరానిది ఏదైనా జరిగితే చిన్నారుల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

పొక్లెయిన్, లారీ సీజ్

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని ఈ– 9 రహదారిలో కంకరను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పొక్లెయిన్, లారీని సీజ్ చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న నలుగురినిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దుగ్గిరాలలో స్వాతంత్ర్య వేడుకల సందడి



మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాలలో పంద్రాగస్టు సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. మువ్వెన్నెల జెండాలు రెపరెపలాడాయి. ఎంపీడీఓ కుసుమశ్రీ ర్యాలీని ప్రారంభించారు.

త్రివర్ణ శోభితంగా ఎయిమ్స్ భవనం



పంద్రాగస్టును పురస్కరించుకుని మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) భవనం త్రివర్ణ శోభితంగా విద్యుత్ కాంతులీనుతోంది. అధికారులు మూడు రంగుల విద్యుత్ బల్బులతో సుందరంగా అలంకరించారు.

–మంగళగిరి

స్వాతంత్ర్య స్ఫూర్తితో పనిచేయాలి



హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాడికొండ: స్వాతంత్ర్యోద్యమ అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని తుళ్లూరు మార్గదర్శి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులతో జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తుళ్లూరు గ్రంథాలయాధికారి టి.గిరిధర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జెండాలు సిద్ధం



స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగుర వేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత కొద్ది రోజులుగా ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. నగరంలోని కాజ టోల్ గేట్‌తో జెండాల విక్రయాలతో సందడిగా మారింది. చిన్నపిల్లలు, విద్యార్థులు జెండాలు విక్రయిస్తుండడం విశేషం. –మంగళగిరి

డ్రగ్స్‌తో విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దు

సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

మోతడక(తాడికొండ): డ్రగ్స్ సైలెంట్ కిల్లర్ అని, విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి ఊబిలో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ టి.లీలావతి సూచించారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న సమస్య అని, ఆ మహమ్మారి ఉచ్చులో చిక్కుకొని విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోకుండా అవగాహనతో మెలిగి తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది కె.కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విష సంస్కృతి వలన విద్యార్థి దశలో కేసులు నమోదు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

అయితే జీవితంపై ఆ ప్రభావం పడుతుందని చెప్పారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం, అందులో పాలుపంచుకోవడం చట్టరీత్యా నేరమని అందుకు పడే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాస రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ పి.ఫణికుమార్, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ వీవీ సుబ్బారావు, కె.శాంతి ప్రియ పాల్గొన్నారు.

బిందు సేద్యంతో రైతులకు మేలు

ఫిరంగిపురం: బిందుసేద్యంతో రైతులకు ఎంతో మేలు అని హార్టికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామం శివారులో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను బుధవారం పరిశీలించారు. పొలంలోని బిందు, తుంపర్ల సేద్య పరికరాలను పరిశీలించారు. డ్రిప్ పరికరాల పనితనం దానికి వచ్చే సబ్సిడీపై ఆరా తీశారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తామని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు దానివల్ల కలగవని మన్నికతో అవి పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి హరినాథరెడ్డి, పథక సంచాలకులు ఎల్.వజ్రశ్రీ, చరణ్,



పంటను పరిశీలిస్తున్న హార్టికల్చరల్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ అధికారి హరినాథరెడ్డి

గౌతమ్, వెంకటేశ్వర్లు, గణేష్, ఫినోలేక్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

మంగళగిరి: ఆటోలో ఎక్కిన మహిళ విలువైన వస్తువులు మరచిపోగా ఆటో డ్రైవర్ మహిళకు తన వస్తువులను అందజేసి నిజాయతీ చాటుకున్నాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. రాధ గుంటూరు నుంచి మంగళగిరి ల్యాప్‌ట్యాప్‌తో పాటు పలు వెండి వస్తువులతో ఉన్న బ్యాగ్‌తో ఆటో ఎక్కింది. మంగళగిరిలో బ్యాగ్ మరిచిపోయి ఆటో దిగిపోయింది. కొత్త బస్టాండ్ వద్ద ఆటోలో అందరు దిగిపోగా బ్యాగ్‌ను గమనించిన ఆటోడ్రైవర్ సురేష్ బ్యాగ్‌ను వెంటనే పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌లో సీఐ వినోద్ కుమార్‌కి అప్పగించాడు. కొద్ది సేపటికి మహిళ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు చేరుకోగా సీఐ బ్యాగ్ చూపించడంతో తన బ్యాగేనని తెలిపింది. వెంటనే ఆటోడ్రైవర్ సురేష్‌ను పిలిపించి ఆయన చేతుల మీదుగా మహిళకు అప్పగించారు.



మహిళకు తన వస్తువులు అందజేస్తున్న ఆటో డ్రైవర్ సురేష్

కొండవీటి వాగులో గుర్రపు డెక్క తొలగించాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్

మంగళగిరి: కొండవీటి వాగులో గుర్రపు డెక్క, తూటికాడను వెంటనే తొలగించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వాగుకు వరద వస్తే పొలాలు ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొండవీటి వాగు పేరేచర్ల లాకు ఆనకట్ట నుంచి ఉండవల్లి అవుట్ ఫాల్ స్లూయిజ్ వరకు 29 కిలో మీటర్ల మేర తాడికొండ, మంగళగిరి, తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు మండలాల్లోని 13,500 ఎకరాలు సాగుభూమి ఉందని చెప్పారు. అమరావతి రాజధాని నేపథ్యంలో ఉండవల్లి పీడబ్ల్యూడీ వర్క్ షాప్ వద్ద రూ.270 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారన్నారు. కొండవీటి వాగులోని గుర్రపు డెక్క, తూటి కాడ నిర్మూలించకపోతే ప్రవాహం సాగక ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోతుందని



కొండవీటి వాగును పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

చెప్పారు. ఎత్తిపోతల పథకం వలన ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వాగులోని గుర్రపు డెక్క, తూటి కాడను తొలగించి పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు జొన్నా శివశంకర్, పి.వీరాస్వామి, టి.భక్కిరెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

మేడికొండూరు: మానవ మనుగడకు మొక్కలు ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని విశదల గ్రామ రహదారిలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా కిలో మీటరు పరిధిలో 400 మొక్కలను రూ.3.77 లక్షలతో మొక్కలు నాటే ప్రణాళిక సిద్ధం చేశారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోపాటు, ఆక్సిజన్ అందించడంలో చెట్లు ఎంతో మేలు చేస్తాయన్నారు. మొక్కలను ప్రతి ఒక్కరూ పర్యవేక్షిస్తూ వాటిని పరక్షించాలన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో డ్వామా



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

పీడీ ఉమాదేవి, ఎంపీడీఓ ప్రభాకరరావు, తహసీల్దారు జి.పద్మనాభుడు, ఎన్నారై ఈజీఎస్ ఏపీఓ కిరణ్మయి, సీఐ దార్ల జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

తెనాలి అర్బన్: జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికను ఈ నెల 18న తక్కెళ్ళపాడు గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింత మల్లికార్జునరావు బుధవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30, 31, సెప్టెంబర్ ఒకటో తేదీన అనకాపల్లిలో రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. వివరాలకు ఫోను నంబర్ 95330 67682లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైద్యసిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ



మంగళగిరిఐ కోల్‌కొత్తాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు. నిందితులును కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

మంగళగిరి: ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ షేక్ మాబు సుభాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

రేపు దుర్గానగర్‌లో సామూహిక వరలక్ష్మీవ్రతం

మంగళగిరి: పట్టణంలోని పాత మంగళగిరి జాతీయ రహదారి వెంట ఉన్న కనకదుర్గా నగర్‌లోని దుర్గాదేవి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మ వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు నేడు

మంగళగిరి: స్వాతంత్ర్య వేడుకలను వైఎస్సార్ సీపీ తాడేపల్లి కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పరిశుభ్రమైన నగరమే లక్ష్యం

మంగళగిరి: పరిశుభ్రమైన నగరమే లక్ష్యంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లో భాగంగా వ్యర్థాల సేకరణ, రవాణాపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లను క్రమం తప్పకుండా శుభ్రపరచడం, పిల్లలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం, నీటి నాణ్యత, సురక్షిత తాగునీటి సరఫరా, అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు